www.kalamjyothi.com

కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
15.10.2026

నేడు అలిగిన బతుకమ్మ



బతుకమ్మ పండుగలో ఆరో రోజైన ఆశ్వయుజ పంచమి నాడు బతుకమ్మను అలిగిన బతుకమ్మగా ఆరాధిస్తారు. అంటే ఈరోజు బతుకమ్మ అలకపోతుంది. ఈరోజున గౌరీ దేవి బాధపడ్డారని భక్తులు నమ్ముతారు. ఈ రోజున అమ్మవారు అలిగి ఏమి తినరని అంటారు. అందుకే నైవేద్యం ఏమీ సమర్పించరు.



ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రాబోయే రోజుల్లో దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు క్యూర్, ప్యూర్, రేర్ పేరిట మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావాలని, అభివృద్ధిపైనే తమ ప్రభుత్వం పూర్తి దృష్టి సారించిందని ఉద్ఘాటించారు.

2 లో

- దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 10 శాతానికి పెంపు
- మూడు జోన్ల సమగ్ర ప్రణాళికతో ముందడుగు
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

పెట్టుబడులకు బెస్ట్ డెస్టినేషన్ తెలంగాణే

గ్లోబల్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రూ.53.78 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన
- అచ్చంపేటను రవాణా కూడలిగా మారుస్తాం
- రైతుల సమస్యల పరిష్కారానికి పక్కా చర్యలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మన్ననూర్‌లో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

4 లో





కార్మికుల హక్కుల కోసం భారీ పోరాటం

3 లో

సింగరేణిలో కుంభకోణాల కుంభమేళా

- మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రూ.10 వేల కోట్ల దోపిడీ
- సంస్థ ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీల కుట్ర
- దోపిడీపై కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడరు?
- గోదావరిఖని కార్మిక గర్జనలో కేటీఆర్ ధ్వజం

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
గురువారం 15.10.2026
www.kalamjyothi.com



పెట్టుబడులకు బెస్ట్ డెస్టినేషన్ తెలంగాణే

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 14) : ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను రాబోయే రోజుల్లో 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు అమలు చేస్తూ పారిశ్రామిక రంగానికి పూర్తి రక్షణ కల్పిస్తామని, తెలంగాణ రైజింగ్ లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మూడు జోన్లుగా రాష్ట్రాభివృద్ధి ప్రణాళిక..

తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్‌ను వివరిస్తూ, రాష్ట్రాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరీఅర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ) అనే మూడు ప్రధాన జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలి భాగాన్ని ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఓఆర్ఆర్, రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య తయారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్స్ రంగాన్ని ప్రోత్సహిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.

2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ..

రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల మహా ఆర్థిక వ్యవస్థగా నిలపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రధాని నిర్దేశించిన వికసిత్ భారత్ లక్ష్య సాధనలో రాష్ట్రాల పాత్ర ఎంతో కీలకమని గుర్తుచేశారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదిగిన క్రమాన్ని వివరించిన సీఎం, రాజకీయాలు కేవలం ఎన్నికలకే పరిమితం కావాలని, పాలనలో అభివృద్ధిపైనే పూర్తి దృష్టి సారించాలని ఉద్ఘాటించారు.

మహిళా, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం..

రాష్ట్రంలోని స్థానిక పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళా, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ముందుకు రావాలని సూచించారు. నూతన పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్నిరకాల మౌలిక వసతులు, రాయితీలు కల్పిస్తూ తెలంగాణను పారిశ్రామిక హబ్‌గా నిలుపుతామని హామీ ఇచ్చారు.



నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

కలెక్టర్ భవేష్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 14) : నర్సింగ్ వృత్తి పవిత్రమైందని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం లో విద్యా బోధన జరగాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి, కళాశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాలకు సంబంధించి, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సంఖ్య అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం విద్యా సంవత్సర సిలబస్ పూర్తి చేయాలన్నారు. నర్సింగ్ వృత్తి అంటే ప్రజలకు నిస్వార్థ సేవ అందించడమని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించాలన్నారు. చదువు పూర్తి కాగానే వారు నర్సింగ్ వృత్తిలో స్థిరపడేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రాక్టికల్ విద్యాబోధన మెరుగ్గా అందించేలా దృష్టి సారించాలని సూచించారు. కళాశాలలో పలు మౌలిక వసతుల అవసరాలను ఆయన దృష్టికి తెచ్చిన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ మంజుల, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి నగదు పంపిణీ

- సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య ఆదర్శం
- పండుగ వేళ కార్మికులకు ప్రోత్సాహం



కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 14) : ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య గ్రామపంచాయతీ సిబ్బందికి నగదు పంపిణీ చేశారు. పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున మొత్తం రూ.7,000 నగదును అందజేశారు.
పారిశుధ్య కార్మికులు తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తుండటం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండటంలో వారి పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి..

గ్రామాభివృద్ధికి పంచాయతీ పాలకవర్గంతో పాటు సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి తన వంతుగా ఈ ఆర్థిక సాయం అందించడం సంతృప్తినిచ్చిందని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు లింగంపల్లి అనిల్ కుమార్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది శీలం బాబు, మాంకాలీ కిరణ్, లింగంపల్లి దుర్గప్రసాద్, పసుల కనకయ్య, బంగారి రుక్కవ్వ, కాంపెల్లి కనకవ్వ, పసుల లత తదితరులు పాల్గొన్నారు.



పంజ సంపత్ నియామకంపై హర్షం

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి
- సంక్షేమ సంఘం కార్యదర్శిగా ఎన్నిక

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 14) : తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పంజ సంపత్ కుమార్ ఎన్నిక కావడం పట్ల సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం పంజ సంపత్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, అదేవిధంగా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన జర్నలిస్టులందరికీ కూడా ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు నూతనంగా ఎన్నికైన సంపత్ కుమార్ చొరవ చూపి కృషి చేయాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి..

ఎల్లారెడ్డిపేట వర్కింగ్ జర్నలిస్టులందరికీ సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోనైనా లేదా రగుడు వెంకటాపూర్ బైపాస్ రోడ్డు సమీపంలోనైనా ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ చొరవ చూపి సహకరించాలని డిమాండ్ చేశారు. దీనిపై సంపత్ స్పందిస్తూ ఎల్లారెడ్డిపేట జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం సంఘం తరపున శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పెంటం శ్రీనివాస్, ఒగ్గు బాలరాజు యాదవ్, ఒగ్గు మహేష్ యాదవ్, పోతుల గాంధీ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తూరి ప్రవీణ్‌రెడ్డి, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మగా అమ్మవారి దివ్య దర్శనం

సిద్దేశ్వరాలయంలో విశేష పూజలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 14) : మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ దేవి అవతారంలో దివ్య దర్శనమిచ్చారు. ఈ ప్రత్యేక అలంకరణ కోసం కంకల మల్లయ్య, మాధవి దంపతులు రూ.31 వేల విరాళాన్ని సమర్పించారు. ఆలయ అర్చకులు రావికోటి మఠం భిక్షపతి, సాయి శాస్త్రి, గణేష్ శాస్త్రి వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
గురువారం 15.10.2026
www.kalamjyothi.com

కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం

భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కుంభకోణాల కుంభమేళా నడుస్తోందని, సింగరేణిని వేల కోట్ల అవినీతి తో దివాలా తీయించి చివరకు అదానీ, అంబానీలకు అప్ప గించి ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్ కయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం రాత్రి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన మహాసభలో ఆయన పాల్గొని సుదీర్ఘంగా ప్రసంగించారు. సంస్థలో సైట్ విజిట్ మొదలుకుని డీజిల్, పవర్ స్కాముల వరకు దాదాపు రూ.10 వేల కోట్ల దోపిడీ జరిగిందని విమర్శించారు. కార్మికుల హక్కులను కా లరాస్తూ సంస్థను నిర్వీర్యం చేస్తే సహించేది లేదని, ప్రజాక్షేత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించి పెద్ద ఎత్తున తిరగబడతామని హెచ్చరించారు.



కలంజ్యోతి, కరీంనగర్ (అక్టోబర్ 14) మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కుంభకోణాల కుంభమేళా నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం రాత్రి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన మహాసభలో ఆయన ప్రసంగించారు. సింగరేణిలో సైట్ విజిట్ స్కామ్, డీజిల్ స్కామ్, జిలెటిన్ స్టిక్స్ స్కామ్, సోలార్ స్కామ్, జైపూర్ పవర్ స్కామ్ వంటి భారీ కుంభకోణాల జాబితా చిత్రగుప్తుడి చిట్టాను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్థలో దాదాపు రూ.10 వేల కోట్ల దోపిడీ జరిగిందని, ఇప్పటికే ట్రాన్స్‌కోలో 24 శాతం వాటాను ప్రైవేట్‌కు ఇచ్చేందుకు సిద్ధమైన రేవంత్ సర్కార్, సింగరేణిని సైతం అదానీ, అంబానీలకు అప్పగించి ప్రైవేటీకరించేందుకు చూస్తోందని ఆరోపించారు.

తగ్గిన ఉత్పత్తి, పెరుగుతున్న దందాలు..

సింగరేణి బొగ్గు ఉత్పత్తి పడిపోవడానికి కార్మికులు కారణం కాదని, పాలకుల స్వార్థ ప్రయోజనాలే కారణమని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అధికారం ముగిసే సమయానికి 70 మిలియన్ టన్నులుగా ఉన్న ఉత్పత్తి, ప్రస్తుతం 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని గుర్తుచేశారు. ఓపెన్ కాస్టుల్లో ఓబీ టెండర్లలో వాటాలు తేలకపోవడం, దేశంలో ఎక్కడా లేని విధంగా తీసుకొచ్చిన సైట్ విజిట్ నిబంధనల వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బంధువు సృజన్‌రెడ్డి కాంట్రాక్టర్లను బెదిరిస్తూ భారీ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో నిరంతరం వెలిగిన సింగరేణిని, రాష్ట్ర విద్యుత్ రంగాన్ని నేడు చీకట్లోకి నెట్టారని, పరిశ్రమలకు పవర్ హాలిడేలు, రైతులకు లో ఓల్టేజీ సమస్యలు వచ్చి పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొడతాం..

కాంగ్రెస్ అరాచకాలను, దోపిడీని ఎదిరించి సంస్థను రక్షించుకోవడానికి కార్మిక లోకం మరోసారి ఏకం కావాలని పిలుపునిచ్చారు. చరిత్రలో ఎక్కడైనా కార్మికులు వేతనాలు, బోనస్‌ల కోసం ఉద్యమాలు చేస్తే, గోదావరిఖని కార్మికులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెతో ఢిల్లీని గడగడలాడించిన చరిత్ర కలవారని కొనియాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంస్థ లాభాల్లో కార్మికులకు 32 శాతం వరకు వాటా అందించామని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాన్ని క్రమంగా తగ్గించి వేసిందని విమర్శించారు. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, బొగ్గు బెల్ట్‌లోని మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్, బీజేపీ రహస్య ఒప్పందం..

సింగరేణిలో ఇన్ని వేల కోట్ల అక్రమాలు జరుగుతున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాస్తే ఆయన సీఎం రేవంత్‌రెడ్డికే మళ్లీ లేఖ రాసి చేతులు దులుపుకున్నారని, ఇరు పార్టీలు కుమ్మక్కై సంస్థను కొల్లగొడుతున్నాయని ఆరోపించారు. సింగరేణికి ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయి పడిందని, అభివృద్ధిని గాలికొదిలేసి ఢిల్లీకి కప్పం కట్టడానికే నిధులు వాడుతున్నారని దుయ్యబట్టారు. 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించకుండా ఎందుకు తాత్సారం చేస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

కార్మికుల పక్షాన నిలిచేది కేసీఆర్ మాత్రమే..

కార్పొరేట్ శక్తుల నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కంటికి రెప్పలా కాపాడుకున్న చరిత్ర కేసీఆర్‌కు మాత్రమే ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణిని మళ్లీ సిరుల గనిగా మార్చాలన్నా, కార్మికుల భద్రత కాపాడాలన్నా గులాబీ జెండాతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ సభలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, కటారి రేవతి, రామగుండం మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మమతారెడ్డి, నాయకులు దాసరి ఉష, వ్యాళ్ల హరీశ్‌రెడ్డి, కౌశిక్ హరి, మూల విజయారెడ్డి, నడిపెల్లి మురళీధర్‌రావు, పీటీ స్వామి, టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, చెల్పూరి సతీశ్, పలు కార్పొరేషన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
గురువారం 15.10.2026
4
www.kalamjyothi.com



సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 14) : తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో పర్యటించిన ఆయనకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.53.78 కోట్ల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అంబేద్కర్, గద్దర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, నూతన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట..

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి పౌరుడికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.1.64 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని, నిరుద్యోగ యువతకు 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ, రహదారుల సమగ్ర అభివృద్ధికి రూ.90 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

అచ్చంపేట నియోజకవర్గానికి ప్రాధాన్యం..

అచ్చంపేట నియోజకవర్గంలో పేదల కోసం 7,300 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించామని తెలిపారు. అచ్చంపేట ప్రాంతంతో తనకు 46 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. నల్లమల ప్రాంతంలో ఎకో టూరిజాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం..

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గానికి కొత్తగా 14 విద్యుత్ సబ్‌స్టేషన్లతో పాటు మరో రెండు భారీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక సహకారంతో ఈ ప్రాంత రైతుల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సద్దుల బతుకమ్మకు కలెక్టర్, ఎస్పీకి ఆహ్వానం

- మూలవాగు తెప్ప వద్ద శుక్రవారం వేడుకలు
- వేములవాడలో ఏడు రోజులకే సద్దుల సంబరం



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 14) : వేములవాడ పట్టణంలోని మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ నగేష్‌లను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కౌన్సిలర్లతో కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ కాగా, వేములవాడలో మాత్రం ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయమని చైర్మన్ పుల్కం రాజు కలెక్టర్‌కు వివరించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి..

ఈ వేడుకలకు వేలాది మంది భక్తులు, మహిళలు తరలివచ్చే అవకాశం ఉండటంతో తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, భద్రతకు అవసరమైన అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, ఏల శ్రీనివాస్, తోటరాజు, కొండ రాజశేఖర్, సంతోష కరుణాకర్, రామతీర్థపు కృష్ణవేణి పాల్గొన్నారు.





సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ ఇన్‌చార్జీల భేటీ

- నియోజకవర్గాల అభివృద్ధి నిధులపై కృతజ్ఞతలు
- రూ.350 కోట్ల మంజూరుపై హర్షం
- హైదరాబాద్‌లో ముఖ్యమంత్రితో భేటీ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 14) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ముఖ్యమంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

రూ.350 కోట్ల నిధులపై కృతజ్ఞతలు..

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి కోసం రూ.350 కోట్లు మంజూరు చేసి, భారీ బహిరంగ సభ ద్వారా ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసినందుకు కేకే మహేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు

నేడు మడికొండలో ముఖ్య సమావేశం

సిద్దన రమేష్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 14) : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు మడికొండలోని సత్యసాయి గార్డెన్స్ లేదా కన్వెన్షన్ హాల్లో ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్దన రమేష్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ, ఎన్నికల కార్యాచరణ, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై కీలకమైన దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపు..

ఈ సమావేశానికి చెన్నారావుపేట మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు, మండల యువజన నాయకులు, ముఖ్య నేతలు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని సిద్దన రమేష్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటు నమోదు నుంచి ఎన్నికల విజయం సాధించే వరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
గురువారం 15.10.2026
www.kalamjyothi.com

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

- ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహణ
- కేంద్రాల్లో అందుబాటులో బీఎల్వోలు
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల (అక్టోబర్ 14) : రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువతీ యువకులు సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాలు జరిగే రోజుల్లో ఆయా కేంద్రాలలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారని స్పష్టం చేశారు.



కాత్యాయని అలంకారంలో అమ్మవారి దర్శనం

- దౌల్తాబాద్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 14) : మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మవారు కాత్యాయని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన అమ్మవారికి దుర్గాభవాని భక్తులు, గ్రామ ప్రజలు విశేష పూజలు నిర్వహించారు.

తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు..

అమ్మవారి దివ్య ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని గ్రామస్తులు వేడుకున్నారు. అనంతరం భక్తులు మహా చాండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కరెంట్ కష్టాలతో అన్నదాతల కన్నెర్ర

- రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి
- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం
- తిమ్మాజిపేట మహాధర్నాకు మర్రి జనార్దన్‌రెడ్డి సంఘీభావం
- అన్నదాతల మహాధర్నాకు మద్దతు





కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 14) : వ్యవసాయానికి సరిపడా కరెంట్ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు చేపట్టిన మహాధర్నాలో ఆయన పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కష్టాలు..

ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. పంటలకు నీరందించాల్సిన కీలక సమయంలో సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎన్నో అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న కర్షకులకు కరెంట్ సమస్యలు మరింత భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతాంగం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గుర్తించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.

24 గంటల విద్యుత్ అందించాలి..

తిమ్మాజిపేట మండల పరిధిలోనెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, సాగుకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే వారి పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని మర్రి జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.

ఎస్సైని కలిసిన మహిళా సంఘం ప్రతినిధులు

మగ్దూంపురం సమస్యలపై వినతి



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 14) : చెన్నారావుపేట మండల పరిధిలోని మగ్దూంపురం గ్రామానికి చెందిన మహిళా సంఘం అధ్యక్షురాలు జూలూరి రేణుక ఆధ్వర్యంలో సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పొన్నాల గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, సంఘం అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు. మహిళా సంఘాల బలోపేతానికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు తామంతా ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మగ్దూంపురం మహిళా సంఘం అధ్యక్షురాలు జూలూరి రేణుకతో పాటు ముఖ్య సభ్యులు కొంకటి ఎలిషా, పైడిపల్లి కవిత, పల్లంకొండ రాధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సీఎల వివరాలపై ఆర్టీఐ

నిర్ణీత గడువులోగా సమాచారం అందించాలి



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 14) : చెన్నారావుపేట మండలంలోని మహిళా సంఘాల సీఎల విద్యార్థతలు, సెర్ప్ మార్గదర్శకాలు, విధులపై జల్లి గ్రామానికి చెందిన కాట విమల సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా దరఖాస్తు చేసుకోగా, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆ దరఖాస్తును సెక్షన్ 6(3) కింద పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ చేసినట్లు ఆర్టీఐ పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి తెలిపారు. కేవలం దరఖాస్తును బదిలీ చేయడమే కాకుండా సీఎల విద్యార్థతలు, విధులు, సెర్ప్ మార్గదర్శకాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి పథకాల అర్హతలకు సంబంధించిన పూర్తి పత్రాల నకళ్లను అధికారులు నిర్ణీత గడువులోగా అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా సంఘాల పథకాల్లో పారదర్శకత కోసం కోరిన వివరాలు అధికారిక రికార్డుల ఆధారంగా ఇవ్వకుంటే చట్టప్రకారం మొదటి అప్పీల్‌కు వెళ్తామని స్పష్టం చేశారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
6
గురువారం 15.10.2026
www.kalamjyothi.com



సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి తీరుతాం
- గత ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది
- నార్లాపూర్ బాహుబలి మోటార్లు ప్రారంభించిన జూపల్లి



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 14) : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను ఆయన ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.

ప్రాజెక్టు పనుల్లో గత పాలకుల అలసత్వం..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే గతంలో జాతికి అంకితం చేశారని, తీరా చూస్తే కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర ప్రధాన పనులను అప్పటి ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు చిత్తశుద్ధితో పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు.

లక్షలాది ఎకరాల ఆయకట్టు నిర్లక్ష్యం..

మహాత్మాగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని మంత్రి వివరించారు. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు.

రూ.8 లక్షల కోట్ల అప్పులపై నిలదీత..

రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి సకాలంలో సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఇప్పుడు ప్రాజెక్టుల పురోగతిపై కనీస అవగాహన లేకుండా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు.

ప్రాజెక్టుల పనులపై నిరంతర సమీక్షలు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తాను ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నామని, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుకు అన్నీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్:(అక్టోబర్ 14) : ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా, రైతులకు సకాలంలో సేవలు అందిస్తూ ధాన్యం సేకరణను సజావుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రూపొందించిన గోడప్రతులను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మున్నూరు కాపు నూతన కమిటీ ఎన్నిక

సంఘం బలోపేతానికి ఐక్యంగా కృషి

అధ్యక్షుడు కముటం కనకయ్య

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 14) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో గల మున్నూరు కాపు సంఘం భవనంలో సంఘ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి, కుల బాంధవుల ఐక్యతకు తోడ్పడేలా కమిటీని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గ అధ్యక్షులుగా కముటం కనకయ్య, ఉపాధ్యక్షులుగా పొన్నగంటి మల్లయ్య, క్యాషియర్‌గా చేర్ల ప్రతాప్, కోశాధికారిగా కముటం రాజయ్య, కుల పెద్దమనిషిగా పూదరి అంజయ్య, సలహాదారులుగా బొల్లం పెంటయ్య, మంతెన వెంకటేశం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ, సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు.



హత్నూరకు బస్సు సౌకర్యం కల్పించాలి

- నర్సాపూర్ డీఎంకు సర్పంచ్ వినతిపత్రం
- ఉదయం 5 గంటలకు నడపాలని విజ్ఞప్తి

కలంజ్యోతి, హత్నూర (అక్టోబర్ 14) : పటాన్‌చెరు నుంచి ఉదయం 5 గంటలకు హత్నూరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ నర్సాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గ్రామ సర్పంచ్ ఎల్లయ్య వినతిపత్రం అందజేశారు. ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగుల సౌకర్యార్థం ఉదయాన్నే బస్సు నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వివరించారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందిస్తూ బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హత్నూర సర్పంచ్ ఎల్లయ్యతో పాటు హత్నూర మండల మాజీ వైస్ ఎంపీపీ పండుగల లక్ష్మి రవికుమార్, ఉప సర్పంచ్ మానస రవీందర్ గౌడ్, గుండా వెంకటేష్, కొడగండ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

భిన్నమైన పాత్రలే లక్ష్యం

నటిగా ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా వైవిధ్యభరితమైన రోల్స్ తో ప్రేక్షకులను మెప్పించడమే తన ప్రధాన లక్ష్యమని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే స్పష్టం చేశారు. వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూనే, తాజాగా 'ఆపరేషన్ గంగా' అనే యాక్షన్ చిత్రం ద్వారా మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెడుతున్నట్లు ఆమె తెలిపారు. చిత్రాల ఎంపిక, ప్రేక్షకులకు మనల్ని మనం ఎలా పరిచయం చేసుకుంటున్నామనే దానిపైనే సినీ ప్రయాణం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు పలు విభిన్న చిత్రాల్లో నటించిన తాను, భవిష్యత్తులోనూ విలక్షణమైన పాత్రల కోసం అన్వేషిస్తూ నటిగా మరింత పరిణతి సాధించేందుకు కృషి చేస్తానని, ఎలాంటి సవాలుతో కూడిన పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా న్యాయం చేయగలననే నమ్మకం తనకు ఉందని భామా వ్యక్తం చేశారు.





Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.